ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- వైద్య శిబిరాల్లో ఉచిత సేవలు


24వ వార్డు వైద్య శిబిరంలో వృద్ధురాలిని పలకరిస్తున్న కె.కె.రాజు


44వ వార్డు వైద్య శిబిరంలో చిన్నారితో మాట్లాడుతున్న కె.కె.రాజు, బాణాల, ఉషశ్రీ

సీతమ్మధార: ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 139 సచివాలయం పరిధికి సంబంధించి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య విషయంలో పెద్దపీట వేసి, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరినీ ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కన్వీనర్ లజపతిరాయ్, వైద్యులు మన్మోహన్, మండల అధ్యక్షురాలు జి.వి.రమణి, కర్రి మురళీకృష్ణారెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, కామేశ్వరరెడ్డి, శివరంజిని, కుసుమ, సీతాకుమారి, లావణ్య, శాంతి, జీవీఎంసీ అధికారులు, సచివాలయం అడ్మిన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రే సీఎం లక్ష్యం

సీతంపేట: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 44వ వార్డు 243 సచివాలయానికి సంబంధించి దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు అందించిన సేవలను కె.కె.రాజు పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, జేఏసీ కన్వీనర్ లజపతి రాయి, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, స్థానిక నాయకులు సీతారాం, శివ, కన్నప్పడు, పి.గోపి, వెంకటరావు, గంగామహేష్, జక్కంపూడి సత్యనారాయణ, సత్తిబాబు, రాంబాబు, కాయాల రామారావు, డాక్టర్ తనూజ, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.39.50 లక్షలతో అభివృద్ధి పనులు


శ్రీనివాసనగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు 244, 245 సచివాలయాల పరిధి శ్రీనివాసనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.39.50 లక్షలతో సీసీ డ్రెయిన్లు, రోడ్లు నిర్మించనున్నారు. ఈ పనులకు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, 44వ వార్డు నాయకులు సీతారాం, శివ, కన్నప్పడు, పి.గోపి, వెంకటరావు, గంగా మహేష్, జక్కంపూడి సత్యనారాయణ, సత్తిబాబు, ఎం.రాంబాబు, కాయల రామారావు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా అన్నసమారాధనలు


బీటీఆర్ కాలనీలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు బీటీఆర్ కాలనీలో శ్రీకనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, గాయత్రినగర్, గణేషనగర్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శనివారం అన్నసమారాధనలు నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. యలమంచిలి ఏసు, పాలీపు ధనాజి, బొమ్మాళి రవి, అలజంగి జగన్, గుడివాడ గౌరునాయుడు, పైడితల్లి, ఇమంది చిన్న, ఉలవల బాబ్జి, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- క్రేజీ బాయ్స్ అధ్వర్యంలో సీతంపేటలో అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, న్యాయవాది నల్లమిల్లి వెంకటరెడ్డి అమ్మవారికి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వై.గణేష్, సంతోష్, అప్పలరాజు, శేఖర్, రమణమూర్తి, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, కేర్ ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ పి.వేణు మాధవి, సాధారణ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ డీఎస్‌వీ వేణి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో రక్తపోటు, చక్కెర వ్యాధి పరీక్షలతోపాటు ఈసీజీ పరీక్షలు చేస్తారని వారు చెప్పారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన


రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పాత రేసపువానిపాలెంలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పరిశీలించారు. రూ.6 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్న నేపథ్యంలో నాణ్యమైన సిమెంట్ కాంక్రీట్ వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రోడ్డు పనులు సక్రమంగా జరగాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వార్డులో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో దల్లి రామకృష్ణారెడ్డి, సాడి కేశవరెడ్డి, కామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు


పేద మహిళలకు చీరలు అందజేస్తున్న అతిథులు, బౌద్ధ సమాజం సభ్యులు

కంచరపాలెం: ఆశ్వయిజ మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో బుద్ధిడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాసకుడు కోన వెంకటరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు మయన్మార్ ఆంధ్ర రీప్యాటియేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎం ఫ్రెడ్డీ, కార్యదర్శి మోహన్‌రావు బుద్ధుడి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం జరిపారు. కార్యక్రమంలో రాజు, భీమారావు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఈ-హుండీ పునరుద్ధరణ

సింహాచలం: సింహగిరిపై ఈ హుండీని శనివారం నుంచి పునరుద్ధరించారు. సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థంర్థం గోగుల్ పే, ఫోన్‌పే, పేటిఎం ద్వారా హుండీ కానుక చెల్లించే విధానం గతంలో ఉండేది. కొన్ని కారణాల దృష్ట్యా దాన్ని నిలిపివేశారు. తాజాగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈ హుండీ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ఆలయ రాజగోపురం వద్ద స్కానర్ ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని స్కానర్లు ఏర్పాటు చేస్తామని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


తాతబాబు

సీతమ్మధార: ద్వారకానగర్‌లోని సూర్యమహల్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సబ్బి తాతబాబు అనే వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాలిలా.. దసరా సందర్భంగా తాతబాబు కుమారుడు స్వామి మాల వేసి ఈ నెల 23న కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంట్లో తాతబాబు కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి అడిగ్గా.. రాలేదనడంతో శనివారం ద్వారకా పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మన విశాఖ- మన రాజధాని' కి మద్దతు


'మన విశాఖ - మన రాజధాని' పోస్టర్లు ప్రదర్శిస్తున్న కె.కె.రాజు, ప్రొఫెసర్ లజపతిరాయ్ తదితరులు

సీతమ్మధార: జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం 24వ వార్డు రేసపువానిపాలెంలోని వార్డు సచివాలయం వద్ద పరిపాలనా వికేంద్రీకరణపై విశాఖ వందనం కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ లజపతిరాయ్ పాల్గొని మన విశాఖ - మన రాజధాని నినాద పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా లజపతిరాయ్ మాట్లాడుతూ విశాఖ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ విశాఖ పరిపాలన కేంద్రంగా వర్ధిల్లాలని, రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, మండలి అధ్యక్షురాలు జి.వి.రమణి, సచివాలయ కన్వీనర్లు సనపల నారాయణ స్వామి, సోషల్ మీడియా జగదీష్, జగనన్న ఆరోగ్య సురక్ష లబ్ధిదారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన కె.కె.రాజు


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వీధిలైట్లు, కొండవాలు ప్రాంతంలో మెట్లు, రక్షణ గోడల నిర్మాణాలపై ఆయనతో చర్చించారు.

వైభవ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎస్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం అశ్వయుజ పూర్ణిమ సందర్భంగా శ్రీవారికి పంచామృతాభిషేక సేవ నిర్వహించారు. సుప్రభాత సేవలో భాగంగా ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులు మంగళ ధ్వని, వేదమంత్రోచ్చారణలతో ఆలయ అభిషేక ప్రదక్షిణ చేశారు. సన్నిధిగొల్ల సేవ అనంతరం సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలారసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో కూడిన పంచామృతాభిషేకం జరిపారు. 8.30 గంటలకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి అర్చన చేశారు. దాతలకు శ్రీవారి శాలువా, కండువా, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. మంగళాశాసనాలు, తీర్థప్రసాద గోష్టి జరిగింది. ఆలయ కార్యనిర్వహణధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. చంద్ర గ్రహణం కారణంగా ఉదయం 10 గంటల తర్వాత దర్శనాలు నిలిపివేశారు.

సంపత్ వెంకన్నకు సుప్రభాత సేవ


వేంకటేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మిదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో వెంకన్నకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయంలో మూలవిరాట్‌లకు చక్రస్నాన పూజలు జరిపారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. చంద్ర గ్రహణం కావడంతో సాయంత్రం 6 గంటలకు ఆలయాన్ని మూసివేశారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు


ధర్మకాటా వద్ద తూకం సరిచూస్తున్న వినియోగదారులు

సీతంపేట: లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు శనివారం నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు నిర్వహించారు. రైతులు, వ్యాపారులు తూనిక కోసం వినియోగించే కాటాలు, తూకం రాళ్ల సీళ్లు పరిశీలించారు. సీళ్లు లేని కాటాలు వినియోగిస్తున్న ఇద్దరు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. వినియోగదారుల అవగాహన కోసం ధర్మాకాటా నిర్వహించారు వినియోగదారులు కొనుగోలు చేసిన కూరగాయలు సరైన తూకం ఉందో లేదో ధర్మకాటా వద్ద పరిశీలించుకోవచ్చని తెలిపారు. చాలా మంది వినియోగదారులు తూకం సరిగా ఉందో లేదో ధర్మకాటా వద్ద సరి చూసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అధికారులు వి.రామారావు, అప్పలరాజు, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు మాధవధార కొండపై ట్రెకింగ్

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ సంఘం ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం, ప్రకృతి అందాల వీక్షణం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ట్రెకింగ్ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మాధవధార మాధవస్వామి ఆలయం గుడి మెట్ల దగ్గర ట్రెకింగ్ ప్రారంభమై సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి గుడి వద్ద ముగుస్తుందన్నారు. మానవ సేవే మాధవ సేవ సభ్యులతోపాటు స్థానికులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులతో ట్రెకింగ్‌లో పాల్గొనవచ్చని చెప్పారు.

ఈ మార్గంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తామని, కొండపై పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు విత్తనాలు చల్లుతామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 76598 04633, 92966 01500 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయాల మూసివేత


మూసి ఉన్న ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం

సీతమ్మధార: చంద్ర గ్రహణం ప్రభావంతో శనివారం సీతమ్మధార, నక్కవానిపాలెం ప్రాంతాల్లోని పలు దేవాలయాలను మూసివేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు తిరిగి ఆలయాలు తెరవనున్నట్లు అర్చకులు తెలిపారు.

ఏఎస్‌ఐపై దాడి చేసిన పది మందిపై కేసు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐపై దాడికి పాల్పడిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణానగర్ తొండం వినాయకుడి గుడి వద్ద దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి విగ్రహం అనుపు కార్యక్రమంలో భాగంగా డీజే సౌండ్స్ ఎక్కువగా రావడంతో స్థానికులు డయల్ 112కు కాల్ చేశారు. నైట్ రౌండ్స్‌లో ఉన్న ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐ శివకృష్ణ అక్కడికి వెళ్లి నిర్వాహకులకు సౌండ్ తగ్గించాలని చెప్పారు. వారిలో మద్యం తాగిన మత్తులో ఉన్న కొంత మంది ఏఎస్‌ఐ విధులకు ఆటంకం కలిగించారు. వెంకటసూర్యనారాయణతో కలిసి పది మంది ఆయనపై దాడి చేశారు. స్టేషన్ అధికారి విజయకుమార్‌కు కాల్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో కొంత మంది యువకులు పారిపోయారు. రంగంలోకి దిగిన పోలీసులు పది మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు ఉచిత వైద్య పరీక్షలు


పోలీసులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దొండపర్తి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు పోలీస్ రీజనల్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేర్, మెడికవర్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

మీటర్ రీడర్ల డిమాండ్లు నెరవేర్చాలి


ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీ చేస్తున్న మీటర్ రీడర్లు

సీతమ్మధార: రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 3,800 మంది మీటర్ రీడర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ శ్రీకాకుళం నుంచి బయలుదేరిన బైక్ యాత్ర శనివారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శివారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మీటర్ రీడర్లకు పీస్ రేటు రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పని దినాల కుదింపును ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దశల వారీగా అర్హతను బట్టి సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం అనకాపల్లి, ఆదివారం రాజమహేంద్రవరం, ఏలూరు మీదుగా 31వ తేదీకి బైక్ యాత్ర ద్వారా విజయవాడకు చేరుకుంటారని తెలిపారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు మీటర్ రీడర్లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, డి.క్రాంతికుమార్, నగేష్, గుప్తా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ ఉత్సవం


మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు చిన్నూరు మసీదు వద్ద మసీదు ఈ నూర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జస్నే గ్యార్వీ షరీఫ్ ఉత్సవం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం జరిగిన విందు కార్యక్రమంలో ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సేనాపతి అప్పారావు, ఐ.హెచ్.ఫారూఖీ, నవాబ్, బాబ్‌జాన్, బొడ్డేటి కిరణ్, ఎం.సునీల్, రాఘవులు, ఫారూఖీ, గౌస్య, కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్‌గా మూడు రోడ్ల జంక్షన్

ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి


ప్రమాదాలకు నిలయమైన సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద జంక్షన్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మూడు రోడ్ల జంక్షన్ ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. గురుద్వారా నుంచి టీపీటీ కాలనీ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వైపు.. సత్యం జంక్షన్ నుంచి నేరుగా అల్లూరి కూడలి వరకు.. అక్కడి నుంచి యూటర్న్ తీసుకుని గురుద్వారాకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. మూడు రోడ్ల కూడలి కావడంతో రాకపోకల సమయంలో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు గురవుతున్నారు. జంక్షన్‌లో గందరగోళంగా సాగుతున్న వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ గతంలో ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులు నిర్వహించేవారు. కొద్ది కాలంగా ఎవరూ లేకపోవడంతో సమస్య తలెత్తింది. నక్కవానిపాలెం నుంచి రాంగ్ రూట్‌లో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్ అధికారులు స్పందించి ఈ కూడలిలో ప్రమాదాల నియంత్రణకు ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ శిక్షణకు ఏయూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) నుంచి ఐదుగురు వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఏయూ అనుబంధ కళాశాలకు చెందిన అశ్రీన మీర్జా మహమ్మద్, కె.రచన, కె.కేథ శ్రీ, పి.హేమలత, ఎస్.కల్యాణిలు నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కేఎల్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఇటువంటి కార్యక్రమాలకు ఏయూ విద్యార్థులు ఎంపిక కావడంపై వీసీ సంతోషం వ్యక్తం చేసి విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పార్థసారథి వర్మ, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలి


మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్

సీతమ్మధార: తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ. పాల్ అన్నారు. శనివారం ఆశీలమెట్టలో గల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలు బీసీ సంఘాలు తమ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాలుగు లక్షల మంది క్రైస్తవ ఓటర్లు ఉన్నారని, ఐదు వేల చర్చిలు ఉన్నాయన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో నవంబర్ 9వ తేదీన 10 గంటలకు బీసీ మహాసభ జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. తాను వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తానే అడ్డుకున్నానన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, బీసీ నాయకులు ఎస్.ఎ.రమణ, ఎస్‌సీ అప్పారావు, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువాలు కప్పారు.

రోడ్డుపై అడ్డంగా చెట్టు కొమ్మలు


గాంధీనగర్ రోడ్డులో చెట్టు కొమ్మలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్ రహదారిలో అడ్డంగా చెట్టు కొమ్మలు పడేయడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందికి గురవుతున్నారు. నరికి పడేసిన కొమ్మలను రెండు రోజులుగా తరలించకుండా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.